# నా గుంటూరు ప్రయాణం

శ్రీ గంపల వెంకటలక్ష్మీనరసింహారావు

మా శ్రీమతీ సమేతంగా ఒక్కసారి గుంటూరు రమ్మనమని, మరదలూ తోడల్లుడూ కూడా వుత్తరాల మీద వుత్తరాలు వ్రాస్తూ, ప్రాణాలు తీస్తూన్నారు. ఇక యింట్లో మా దేవిగారు కూడా "పాపం! చెల్లెలూ మరదిగారూ అన్ని వుత్తరాలు రాస్తే, వెళ్ళకపోతే యేం బాగుంటుందండీ? డబ్బు ఖర్చు అవుతుందని, రాలేదు అనుకుంటారో యేం పాడో! ఒక్కసారి వెళ్ళొద్దాం పదండీ! ఏం! దూరమా భారమా? దగ్గిరిలో గుంటూరు పెట్టుకుని. ఆఫీసుకు ఒక్క వారంరోజులు శలవు పెట్టండీ! నాక్కూడా మా చెల్లెల్ని చూడాలని వుంది. మా చెల్లెలి పెళ్ళయిం తర్వాత, యింతవరకు మన మెప్పుడు వెళ్ళ లేదు గూడా!" అని మరోకవైపున పోరు పెట్టూంది. చివరకు యీ పోరుపడలేక, ఆఫీసుకు వారం రోజులు సెలవు పెట్టి ఒక రోజు ప్రయాణం కట్టాను మా దేవిగారితో సహా.

తెల్లవారుఝామున నాల్గుగంటల బండీ అయితే చాలా బాగుంటుంది, ఎండపడక ముందే గమ్యస్థానం చేరవచ్చు"ననే వుద్దేశ్యంతో చివరకా బండే నిశ్చయం చేసుకున్నాను. చెల్లెల్ని చూడాలనే సంతోషంవల్లనైతే నేం, వూరుప్రయాణం అనే వుత్సాహంవల్లనైతే నేం, మా శ్రీదేవిగారి కసలా రాత్రంతా నిద్దరే లేదు. సర్దిందే సర్దటం, కట్టిందే కట్టడం యిదే పని ఆమెకా తెల్లార్లూ. వుండేది వారంరోజులయితే, యే నెల్లాళ్ళకో సరిపడే గుడ్డలు రెండు పెట్టెలకు సర్దింది. "యిన్ని గుడ్డలెందుకే? మోతబరువూ, కూలీలదండుగ" అంటే, "వుండనివ్వండీ.! గుంటూరులో ఎర్రమట్టి జాస్తంటారు. గుడ్డలు త్వరగా మాస్తయి" అని సమర్థించింది. పైగా, గుంటూరువాళ్ళు బందరు మిఠాయి అంటే యెంతో అంగలారుస్తారనీ, వెళ్ళకవెళ్ళక వెళ్తూన్నాం పదిరూపాయిల మిఠాయైనా తీసుక వెళ్ళకపోతే యేం బాగుంటుందనీ, పోరుబెట్టి ఆ సాయంకాలమే హల్వా, తొక్కుడు లడ్డూలూ యింకేమేమో సరిగా పదిరూపాయిలవి తెప్పించింది. శ్రీవారితో పాటు ఆరాత్రి పదకొండు గంటలవరకు నేను కూడా కొంతవరకు సర్ది, యెంతకూ తెమలకపోతే, చివరకు విసుగొచ్చి పడుకొని నిద్రబోయాను.

తిరిగి ఒంటిగంటకే నన్ను లేపింది మా శ్రీమతి. "యిదేమిటే? యెప్పుడో నాల్గు గంటలకు బండీఅయితే యిప్పుడే యెందుకు లేపావ్? వూరు ప్రయాణమయితే నిద్ర కూడా పోఅక్కర్లేదాయేం?" అని పచ్చి నిద్రలేచిన బడలికమీద, ఒళ్లు విరుచుకుంటూ విసుక్కున్నాను.

"అదేంటండీ! ప్రయాణం ముందు కూడా అలా విసుక్కుంటూ రెందుకూ? ఒక్క రోజు నిద్ర తక్కువైతే యేంపోయిందిప్పుడూ? ఎటుగూడి ఒంటిగంట పైగా అయిందయ్యే. స్నానాలు జపాలుచేసి బయలుదేరేసరికి ఆవేళ కాదాయేం? త్వరగా కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేయండీ వేడినీళ్ళు పెట్టాను." అని గుక్క తిరక్కుండా అనేసింది.

ముఖం కడుక్కొని నీళ్ళగదిలో కెళ్లేసరికి, ఒక పెద్ద కాగునిండా వేడినీళ్లూ, పక్కనే సబ్బు, తెల్లటితువ్వాలు రెడీగా పెట్టున్నయ్. అప్పటికే మా శ్రీవారి స్నానం అయిపోయింది. ప్రయాణం సర్దాలో అర్ధరాత్రి అని కూడా అనుకోకుండా, వేడినీళ్ళు పెట్టి యిచ్చినందుకు మా శ్రీవారి నెంతో మెచ్చుకుంటూ, సరిగా నిద్రకూడా లేని బడలికవల్ల ఆ వేడినీళ్లతో హాయిగా స్నానంచేశాను. అట్లా స్నానం చేస్తూంటే నాకు హఠాత్తుగా గుర్తుకు వచ్చింది—వేసవికాలంలో గుంటూరులో సరిగా నీళ్లు దొరకవనీ, అక్కడివాళ్లు నీళ్ళకు చాలా యిబ్బంది పడ్తారనీ. అందువల్ల ఆ పెద్దకాగుడు వేడినీళ్లు పోసుకున్నదే చాలక, పక్కనే చన్నీళ్ళతో నిండావున్న ఒక పెద్దగంగాళంకూడా ఖాళీచేశాను. స్నానంచేసి గదిలోకి వచ్చేసరికి శ్రీవారి ముస్తాబు యింకా పూర్తికాలేదు. పైగా, "ఎంతసేపండీ స్నానం? ఆడదాన్ని నేనే త్వరగా చేశానుగదా!" అంది జడవేసుకుంటూనే. ఆ మాట వినేసరికి నా కరికాలిమంట నెత్తికెక్కింది. కాని ఆ సమయంలో ఆమె ముఖం చూచేసరికి నా కోప మెటుపోయిందో, వెంటనే చల్లబడ్డాను. "అయితే ఆలస్యంలో నాకంటే నీవే మెరుగంటావ్! మరి యింతవరకు నీ తయ్యారీ పూర్తికాలేదుగా?" అని మాత్రం అన్నాను.

"నాదేముందండీ! మీరు వెళ్లి త్వరగా బండితీసుకురండీ! నా జడకూడా అయిపోయింది. నేను తయారుగానే వున్నాను." అంది యిక తన ఆలస్య మేమీ లేనట్టే. ఆ మాట వినేసరికి నాకు నవ్వువచ్చింది. వెంటనే, నేను డ్రస్సు చేసుకొని బండికని బయటకు వచ్చేసరికి, రాత్రి నేను చెప్పివున్న బండి సాహెబ్ తన గుర్రంబండి తీసుకొని అప్పుడే వస్తూన్నాడు. "బండికూడా వచ్చేసింది, త్వరగా కానియ్యి," అంటూ తిరిగి లోపలికి వెళ్లాను.

*　　*　　*

రైలు సరిగా గుంటూరు చేరేసరికి పదిగంటలయ్యింది. మేము వస్తూన్నట్లుగా ముందే కార్డు వ్రాసివున్నందువల్ల, మా తోడల్లుడు స్టేషనుకు వచ్చాడు. అందువల్ల వారి యిల్లు వెతుక్కునేఅవస్థ లేకుండానే, రెండు సైకిల్ రిక్షాలు మాట్లాడుకొని అరండేలుపేట మూడవలైనులో వున్న వాళ్ళ యిల్లు త్వరలోనే చేరుకున్నాం. నేను గుంటూరు రావడం అదే మొదటిసారి. ఎండ అప్పటికే చిటపటలాడుతోంది.

గుమ్మంలోకి రాగానే మరదలు రెండు చెంబులతో నీళ్లు తెచ్చియిచ్చింది కాళ్ళు కడుక్కోడానికని. ఆ నీళ్లుచూస్తే నా కడుపులో గిర్రున తిప్పింది. వట్టి బురదనీళ్లు. మరదలు గదా! పరాచికానికి బావగార్ని గదా అని బురదనీళ్ళిచ్చిందేమో! అని నా భార్య చెంబులో నీళ్లు చూశాను అవీ అంతే! వెంటనే మరదలు ముఖంవంకొకసారీ, ఆమె భర్తముఖంవంకొకసారీ చూచాను తెల్లబోయి.

"బావగారు మా గుంటూరు నీళ్ళుచూసి మొదటే బెదురుకుంటూన్నారే! పర్వా

లేదు కడుక్కోండి. యిక్కడ యీ నీళ్లు దొరకడమే యెంతో బంగారం." అంది మరదలు నవ్వుతూ. ఎట్లాగో ఆ నీళ్ళతో కాళ్లుమాత్రం కడుక్కున్నాను. నోట్లో గాని, ముఖంమీదగాని పోసుకోబుద్ధి పుట్టలా. లోపలికివచ్చి అక్కడున్న పడక కుర్చీలో కూలబడుతూ, "సుందరం! యీ నీళ్లు మీ ఒక్క యింట్లోనే యిలా వుంటయ్యా, లేక వూరంతా యింతేనా?" అని అడిగాను తోడల్లుణ్ని.

"వూరంతా యింతేనండి! అసలు యీ నీళ్లయినా దొరకటం చాలా కష్టంగా వుంది. యీ సంవత్సరం భావులన్నీ యెండిపోయి, పట్టే మట్టే బయటపడ్డది. ఎక్కడన్నా ఒక భావిలో, కొద్దో, గొప్పో నీళ్లు వుంటే, ఆ భావిదగ్గిర వందలకొద్దీ జనం. పగలు రాత్రిళ్లు తెరిపివుండదు. అదైనా సర్కారు భావులైతేనే! యిళ్లల్లో వాళ్ళు అసలే రానియ్యరు బయటివారిని.

"మరీ అంత కష్టంగా వుందా?" అన్నాను ఆశ్చర్యంతో.

"కష్టమని నెమ్మదిగా అంటారేం? యీ నీళ్ళ అవస్థ యింతింతగాదు. భావులు చూస్తే పాతాళాని కంటుకొనివున్నై. బొక్కెనవేస్తే సగానికి కూడా మునగదు. తడవకు చారెడునీళ్లు. యే పాతికసార్లో బొక్కెనవేస్తేగాని ఒక్క బిందె నిండదు. పగలు పనిపాటలూ, రాత్రిళ్లు నిద్రకూడా లేకుండా, అట్లానే అవస్థలుపడి, ఎక్కడో మైలుదూరంలో ఏదైనాభావిలో నీళ్లున్నాయని తెలుస్తే, అక్కడకు కూడా వెళ్లి తీసుకొచ్చుకుంటున్నారు. రాత్రిళ్ళు యే క్షణంలో చూచినా, తెల్లవార్లూ భావి గిలకలు గిరగిరా తిర్గుతూండాల్సిందే!"

"మరయితే యీ వూళ్ళో పంపులు లేవూ?"

"సరె! పంపులుంటే యీ అవస్థయెందుకండీ? అక్కడక్కడా పేటకు, నాల్గైదు పంపులున్నయ్. పేరుకు అవైనా యేదో చెరువునీళ్లు. రోజుకొక్క గంటమాత్రం ఆ పంపులు వదులుతారు. ఆ గంటలోనే వందలకొద్దీ బిందెలు పెట్టుకూర్చుంటారు. ఆడాళ్ళు ఒకరి నొకరు తోసుకోడం, పోట్లాడుకోడం తప్ప, చివరకు యింటికో బిందె కూడా రాదా పంపుదగ్గిర. ఆ పంపులైనా, కొన్ని కొన్ని పేటల్లో అసలే లేవు."

"అరె! మరి, గవర్నమెంటు యేం శ్రద్ధ తీసుకోలా? మునిసిపాలిటీవారేం జేస్తున్నారు, నిద్రపోతున్నారా యేం?"

"గవర్నమెంటు శ్రద్ధతీసుకుంటే యింకలేందేముందీ? ఏదో వాటర్ స్కీమన్నారు. అందుకుగాను పెద్ద పెద్ద గొట్టాలు తెప్పించి వూరునిండా పడేశారు. అక్కడేవో పెద్ద పెద్ద టాంకులు కడ్తున్నారు. యిప్పటికి రెండేళ్లు కావస్తూంది. యింతవరకు సగం కూడా పూర్తికాలా! యింకో రెండు మూడేళ్ళకు పూర్తయినా పూర్తయినట్లే! అసలు వాళ్లకేం పట్టిందీ! యీ ప్రజల కష్టాలు చూచేదాకా? వాళ్లకీ కష్టాలుంటేగా? కష్టమంటే యేమిటో వాళ్ళకు తెలుస్తేగా? పైగా యెలక్షన్లు కాస్తా కూడా అయిపోయాయి. యిక వాళ్ళకు ప్రజలతో అవుసరంకూడా తీరిపోయింది. ఎవరెట్టాచస్తే వాళ్ళదేం పోయింది. పోతే, మునిసిపాలిటీ వారంటారా? ఏవో రెండు మూడు వాటర్ లారీలు తెప్పించి, ఆనల్ల చెరువో, ఎర్రచెరువో లేక ఆకో నేటివో నీళ్లు నింపి, ప్రజలకళ్ళ నీళ్ళు తుడవడానికి పగలు రాత్రిళ్లు సప్లయి చేస్తూన్నామంటారు. యింత టవునుకు, యింతమంది జనాభాకు, రెండు మూడు లారీలు యేం సప్లయి చేస్తాయి? ఒక్కొక్క లారీ దగ్గిర యిక చెప్పటానికే వీల్లేదు జనం. ఆ నీళ్ళకోసం ఒకళ్ళనొకళ్లు తోసుకోటం, బిందెలకీ బిందెలేసి పగల కొట్టుకోడం. అసలు ఆడ మగ భేదమే లేదు ఆలారీల దగ్గిర, మనబోటివాళ్ళం పోవటానికూడా భయమేస్తుంది. యింతెందుకండీ! యింకో పదిరోజులు పోతే, అసలీ వూరే ఖాళీ చెయ్యవలసివచ్చేట్టుంది. చెరువుల్లోకూడా యిప్పుడు నీ రెండిపోయే స్థితివచ్చింది. మహావుంటే యింకో పదిపదిహేనురోజులుంటయ్యేమో?"

"పోనీ, అంతవరకైనా, మీరు డబ్బిచ్చి పోయించుకోండి, ఆపాతాళంనుండీ అంత అవస్థపడి నీళ్లులాగాలంటే, గుండెలు పగిలిపోతైగాని వేరేమైనా వుందా?"

"వచ్చే ఆర్జనలు తిండికే చాలక పోతూంటే, యింకా నీళ్లు గూడా యేం కొనుక్కొంటాం యీ రోజుల్లో! అయినా పోసేవాళ్లుకూడా దొరకరు. వాళ్ళడిమాండు మరీ యెక్కువగావుంది. భావిలోంచి నీరు చేదిపోస్తే, బిందె ఒకటికి రూపాయి యివ్వాలి. పోనీ పీపా వాళ్ళ చేత పోయించుకుంటామూ అంటే, పీపా ఒకటికీమూడూ, నాల్గు రూపాయిలు. అదైనా యెంతో బ్రతిమిలాడితేనే పోయటం. వాళ్ళు పిలుస్తేకూడా సరిగా పలుకరు. పీపాకు పన్నెండు బిందెలు షుమారు వుంటై. కొనుక్కుంటే మనజీతాలు అసలు నీళ్ళకే చాలవు."

"తిండికీ గుడ్డకీ కరువనుకొన్నాంగాని, యిక నీటికరువు కూడా వస్తే యింకేముందీ. జనం నశింపుకిక యెక్కువరోజులు లేదన్న మాట. స్వరాజ్యం వచ్చిన తరవాత అంతా ముదనష్టమే. ఒక్క పనీ యింతవరకుసాను


నమ్మకమైన నంజన్‌గూడు కుటుంబ ఔషధములను వాడుడు.

నంజన్‌గూడు పండ్లపొడి

తీపి, ఉప్పు ప్యాకెట్లు.

సకల పండ్లవ్యాధులను ఆపి, మాన్పు

ఐ.డి.యల్. 61. నంజన్‌గూడు పండ్లపొడి (డబ్బి)

శ్రీకర కస్తూరి మాత్రలు — పిల్లలకు. పెద్దలకు శ్రేష్ఠమైన సంజీవి.

కర్జ — (గోరోజన మాత్రలు) పశిపాపలకు.

బాలక్స్ — విరేచన మాత్రలు పెద్దలకు పిల్లలకు

జ్వరేగ్ — సకల జ్వరములకు

కాలరెక్స్ — అతిసారము.కాలరాకు

జిన్‌జిప్ — జీర్ణవృద్ధికి. పిత్తశాంతికి

స్త్రీలకును, ఇతరులకును విశేష మందుల జాబితాలకు వ్రాయండి.

సోల్ ఏజంట్లు: యునైటెడ్ కన్సర్న్, 54, బందరువీధి, మద్రాసు-1.

విజయవాడ బ్రాంచి: 16/46, నాగేశ్వరరావు పంతులురోడ్డు సత్యనారాయణపురము

మా అపూర్వమైన ఔషధముల జాబితాలకు వ్రాయండి.

కాలం కాలా! నాయకులిచ్చే ఉపన్యాసాలు చూస్తే కోటలు దాట్తాయి. అందుకనే మన ఆంధ్రదేశంలో రాజకీయా లిలా తలకిందు లైనాయి.

"అన్నదమ్ముల మాటల్లో భోజనమే మర్చినట్టున్నారే? భోజనానికి లేవండి ఒడ్డించాం!" అంటూ ఇంతలో మూతి తిప్పుకుంటూ వచ్చింది మరదలు. చెల్లెలిమాటల తీరుకు, ఆ వెనకనే మా శ్రీవారు కూడా నిలబడి నవ్వుతూన్నారు.


"యింతసేపూ, నీ గురించే చెప్పుకొనేది. పాపం! నీవు నీళ్ళు తోడలేక అవస్థ పడుతున్నావని, మీ ఆయనగారు చాలా విచార పడ్తున్నారు." అన్నాను కొంటెగా.

"అబ్బ! యెంత ప్రేమా? అయినా యేం చేయాలీ? పోయిం చే శక్తి లేకపోతే తెచ్చుకోక తప్పుతుందా? మీ అన్నదమ్ముల బడాయిచూస్తే, అబ్బ! చెప్పటానికే వీల్లేదు. పైకి వూరికే ప్రేమ పొంగి పొర్లి పోతుంది." అంది తిర్గి మూతి ముప్పై మూడు వంకర్లు తిప్పుతూ. ఆ మాటలకు అంతా నవ్వుకున్నాం. అందరూ ఒక్కసారే భోజనానికి లేచాం.

ఆ సాయంత్రం ఆ బురదనీళ్ళే యెట్లాగో అట్లా స్నానంచేసి పార్కుకు బయలు దేరా షికారుగా. ఇంట్లో మరదలు మాణిక్యాలు చేసిన గారెలు తిని, సేమ్యా పాయసం త్రాగి, టీ గూడా తాగి మరీ బయలుదేరా! పార్కులో కూర్చున్న కాస్సేపటికే గొంతెండిపోయేంత దాహం వేసింది. అక్కడేవున్న ఒక కాఫీ హోటల్లోకెళ్లా మంచినీళ్లు తాగుదామని. వూరికే మంచినీళ్లు అడిగితే అసహ్యంగా బాగుండదని, "ఒక గ్లాసు మంచినీళ్లు ఒక టీ." అన్నా కుర్చీలో కూర్చుంటూ. వెంటనే ఆ సర్వరు నా ముఖంవంక యెగాదిగా ఒక్కమారు చూసి, లోపలకు వెళ్ళి పోయాడు. తిరిగి ఒక గ్లాసు నీళ్ళతో, టీతో సహా వచ్చి, వాటిని నాముందు పెట్టాడు. వాడి తరహా అసలు నాకేమీ అర్థంగాలా! ఆ నీళ్లు బాగాలేకపోయినా, దాహంతోవున్న కక్కుర్తికొద్దీ వెంటనే రెండుగుక్కల్లో తాగేశాను. కాని యింకా దాహం తీరలా! యింకో గ్లాసు యిమ్మన్నాను. వెంటనే వాడు ముఖమంతా కళ్లు జేసుకొంటూ, "మన దే వూ రం డీ?" అన్నాడు. "ఏం?" అన్నాను. "ఏమీ లేదు. యీ వూళ్ళో నీళ్ళు అసలే దొరకటంలా! యింక నాల్గురోజుల్లో మా హోటల్ కూడా మూసేస్తాం నీళ్లులేక. కావాలంటే, టీలోకి యింకా పాలు పొయ్యమన్నా పోస్తానుగాని, నీళ్ళు మాత్రం లేవు." అన్నాడు. "మరి నాకు దాహం తీరలా, యెట్లా?" అన్నాను వాడేమంటాడో తెల్సుకుందామని. "దాహం తీరకపోతే, బటర్ మిల్కు త్రాగండి" అన్నాడు. నేను తెల్లబోయా ఆ మాట విని. "బటర్ మిల్కు వూరికే యిస్తావా?" అన్నా తిరిగి యెగతాళిగా. "గ్లాసు అణన్నర" అన్నాడు. యిక చేసేది లేక, మంచినీళ్ళబదులు బటర్ మిల్కే త్రాగేను. టీకి బేడ, బటర్ మిల్కు కొక అణన్నర, మూడణాలన్నర బిల్లు చెల్లించి బయటకు వచ్చా!

గుంటూరులో నాల్గురోజు లుండేసరికి, నాలుగేళ్లున్నట్లుగావుంది నాకు. ఒక్క నాకేగాదు మా శ్రీవారికీ అంతే! చెల్లెలు కష్టపడుతూంటే చూడలేక, అక్కగారు కూడా పొయ్యేది నీళ్ళకు. ఆ నాల్గురోజుల్లో ఆమె చేతులన్నీ బొబ్బలుపొక్కి, పచ్చిపుళ్ళయినై. వచ్చేటప్పుడు యెంత వుత్సాహపడివచ్చిందో, అంత పోరు పెట్టూం దిప్పుడు "యింటికి పోదాం" అని. నాకూ కూడా యిక ఒక్క క్షణం వుండ బుద్ధిపుట్టలా.

మాతోడల్లుడు వర్ణించి చెప్పిందానికంటే, యీ నాల్గు రోజుల్లో నేను చూచింది యింకా ఘోరంగా వుంది. మేమసలు యీ నాల్గురోజుల్లో సరిగా స్నానంగూడా చేయలా. ఒకొక్కప్పుడు బలవంతంగా దాహం కూడా ఆపుకొనేవాడిని, ఆ నీళ్లు త్రాగలేక. మరీ పట్టలేకపోతే, నీళ్లువడపోయించుకొని, కొద్దికొద్దిగా మందుత్రాగినట్లు వూరికే గొంతు మాత్రం తడుపుకొనేవాడిని. "ఎన్ని జన్మలకైనా యీ గుంటూరుప్రయాణం వద్దురా బాబూ" అన్నంత విరక్తి పుట్టుకొచ్చింది. ఇంకా నాల్గురోజులు శెలవు వున్నప్పటికీ, "ఇక శెలవు లేదు, అయిపోయింది, వెళ్లాలి" అంటూ అబద్ధంచెప్పి, నాల్గవరోజు మధ్యాహ్నం రెండుగంటల బండీలో, వడగాడ్పులు వేస్తూన్నా లెక్ఖ చేయకుండా వచ్చేశాను బందరు. అప్పటి నుండి గుంటూరు ప్రయాణం మాకో సింహస్వప్నమయింది. ★

ఈ సొగసైన "ట్రై సైకిల్"-కు మీ ఆర్డర్లు పంపండి. ఇది ఉత్తమమైనది. కొత్తది. ధరలు రు. 25/-లు నుండి రు 15 లకు తగ్గింపబడినవి. రైలుఛార్జి షుమారు 1/8/- వెంటనేఆర్డరిచ్చి మీ దగ్గరి రైల్వేస్టేషను వ్రాయండి

Midland Trading Co. Ltd.,
P. Box 16605, Calcutta-4.

చదవండి — తెలుగు మాస పత్రిక
జయభారత్




For Madras City
Sovereign Sales Agency Ltd.,
1-12 Second Line Beach, Madras 1